

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ జీవిత బీమా

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, నవంబర్ 20:(ప్రజా జ్యోతి)

రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ జీవిత బీమా పథకం వర్తింప జేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మున్సిపాలిటీ పదో వార్డులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ బీమా పథకం ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి బీమా పథకం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పదో వార్డులో లబ్ధిదారుల ఆహ్వానం మేరకు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని విజయరమణరావు ప్రారంభించారు. **...మిగతా 3 లో...**

ఎంపికైన అంగన్వాడీ టీచర్ల జాబితా సిద్ధం

చొప్పదండి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):

చొప్పదండి మండలంలో అంగన్వాడి టీచర్ల నియామకాలకు సంబంధించి అర్హుల జాబితా సిద్ధం చేసినట్లు ఐసిడిఎస్ సిడిపిఓ నర్సింగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాట్నపల్లి-2, రుక్మాపూర్-1, చొప్పదండి-1, చొప్పదండి-4, చొప్పదండి-6, చొప్పదండి-10 కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతలు, సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ మేరకు అర్హులు, అనర్హుల జాబితాలను సిద్ధం చేసి గ్రామపంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో నోటీస్ బోర్డులపై ప్రదర్శించినట్లు చెప్పారు.

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

21 శనివారం నవంబర్ 2026 పేజీలు 15

పల్లె ప్రకృతి వనంపై గొడ్డలి వేటు!

చెత్త తొలగింపు కేంద్రానం పేరుతో ఏపుగా పెరిగిన చెట్ల నరికివేత..

జేసీబీలతో రెండెకరాల ప్రభుత్వ భూమి చదును

ప్రజాప్రతినిధి భూ వ్యవహారంపై గ్రామస్తుల ఆరోపణలు..

కలెక్టర్ విచారణకు డిమాండ్



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 20, (ప్రజాజ్యోతి):

పచ్చని చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించాల్సిన పల్లె ప్రకృతి వనం విధ్వంసానికి గురైంది. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి పంచాయతీలో సుందరీకరణ పేరుతో ఐదేళ్లుగా పెంచి సంరక్షించిన చెట్లను నరికివేయడం, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని జేసీబీలతో చదును చేయడం వివాదానికి దారితీసింది. సుమారు 13 కుంటల విస్తీర్ణంలో ఉపాధి హామీ పథకం కింద రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలోని ఏపుగా పెరిగిన చెట్లను గొడ్డలితో, రంపాలతో నరికివేశారు. అనంతరం జేసీబీలతో ప్రాంతాన్ని చదును చేశారు. అంతేకాకుండా ప్రకృతి వనానికి ఆనుకుని ఉన్న మరో రెండెకరాల ప్రభుత్వ భూమిని సైతం చదును చేయడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

2



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ఆర్థిక భరోసా

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. **...మిగతా 2 లో...**

18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులు

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడలోని 4వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

బీమా దరఖాస్తులో వివరాల నమోదు పక్కాగా ఉండాలి...

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వివరాలు అందరికీ చేరవేయాలి
- జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు
- వేములవాడ అర్బన్ మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ చీర్లవంచ, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో ప్రత్యేక శిబిరాల్లో జిల్లా కలెక్టర్ పరిశీలన

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో భాగంగా బీమా దరఖాస్తులో వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. **...మిగతా 3 లో...**



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ఆర్థిక భరోసా

మొదటిపేజీ తరువాయి

వేములవాడ పట్టణంలోని 4వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బీమా పథకం పోస్టర్లు, కరపత్రాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.ఐదు లక్షల జీవిత బీమా అందించడమే ఈ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోటి ఐదు లక్షలకు పైగా కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. భూమి, ఆస్తులు లేని కుటుంబాలకు సైతం జీవిత బీమా భరోసా కల్పించాలనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన వారు ఈ పథకంలో నమోదు చేసుకోవాలని, కుటుంబంలో ఎవరిని ప్రధాన సభ్యుడిగా ఎంపిక చేసుకోవాలో వారే నిర్ణయించుకోవచ్చని సూచించారు.జిల్లాలోని అన్ని మున్సి పాలిటీలు, గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ తో హెల్ప్ డెస్క్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలను సైతం గుర్తించి పథకంలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు.ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ?10 లక్షల వరకు వైద్య సహాయం, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ పేదలకు అండగా నిలుస్తోందని వివరించారు. రైతులకు ?20,650 కోట్లకు పైగా రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ లాంటి పథకాలు ప్రజా ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి ?ఐదు లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.బీసీలకు సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కులగణన చేపట్టి దేశానికి రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు సైతం మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.వేములవాడ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, నాలుగో వార్డులో ప్రజలు కోరిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. జమ్మిగద్దె వద్ద దసరా వేడుకలు ఘనంగా నిర్వహించుకునేలా విశాలమైన సీసీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రజల సంక్షేమము పట్టణ అభివృద్ధి రెండు లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని అన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు ఇందిరమ్మ పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించారని గుర్తు చేశారు. కుటుంబ పెద్ద ఏమైనా కారణంతో చనిపోతే వారి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా అందుతుందని, కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు.రాష్ట్రానికి చెందిన అన్ని కుటుంబాల వారు తమ పరిధిలోని ప్రత్యేక నమోదు కేంద్రాల వద్ద రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. డిసెంబర్ 19వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బీమా ఎవరి పేరిట ఉండాలి.. నామినీ ఎవరు ఉండాలో నిర్ణయం తీసుకోవాలని, నామినీ ఒక్కరు లేదా ఎందరు అయినా పెట్టుకోవచ్చని తెలిపారు. 18 నుంచి 59 ఏండ్ల వయసు వారు అర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ కు మెసేజ్ వస్తుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, నోడల్ అధికారి,డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మెప్మా ఏపీ మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఈడీఎం శ్రీనివాస్, వార్డు సభ్యులు తోట రాజు, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనంపై గొడ్డలి వేట!

మొదటిపేజీ తరువాయి

చెత్త తొలగింపు తీర్మానం.. చివరిగా చెట్ల నరికివేత!

ఇక్కడి గ్రామ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రకృతి వనాన్ని ఐదేళ్లుగా వనసేవకుడి ద్వారా సంరక్షిస్తూ వచ్చారు. అయితే ఈ నెల 10న జరిగిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ప్రకృతి వనంలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి, ప్రజలు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని మాత్రమే తీర్మానించినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కానీ ఆ తీర్మానాన్ని ఆధారంగా చేసుకుని పెద్దపెద్ద చెట్లను సైతం నరికివేసినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే నరికిన చెట్లన్నీ పిచ్చిమొక్కలేనని, వాటి స్థానంలో మామిడి, పనస మొక్కలు నాటుతామని సంబంధిత ప్రజాప్రతినిదులు కొత్త పాట పాడడం ఇప్పుడు విడ్డురంగా ఉంది.

రెండెకరాల ప్రభుత్వ భూమిపైనా కన్ను?

అయితే ఈ ప్రకృతి వనం తో పాటు , దిన్ని ఆనుకుని ఉన్న పంచాయితి సంభందించి సుమారు రెండెకరాల అంబ సత్రం ప్రభుత్వ భూమిని సైతం జేసీబీలతో చదును చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ భూమిపై ఓ ప్రజాప్రతినిధి కన్నుపడిందని, భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఉపయోగించుకునే ఉద్దేశంతోనే ఈ పనులు చేపట్టారనే ఆరోపణలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి. గత పంచాయతీ ఎన్నికల్లో చేసిన ఖర్చులను తిరిగి రాబట్టుకునేందుకే ఇసుక, మట్టి తరలింపు, ప్రభుత్వ భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీనికి జిల్లా స్థాయి మరో నేత కూడా వత్తాసు పలుకడం ఇప్పుడు కొత్తగూడెం కేంద్రంగా “ఎర్రటి విప్లవాన్ని” ప్రశ్నిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరగాల్సి ఉంది. పచ్చని ప్రకృతి వనాన్ని ధ్వంసం చేయడంతో పాటు ప్రభుత్వ భూమిని చదును చేసిన వ్యవహారంపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపించాలని గ్రామస్తులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించి, భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

చెట్లను నరికేందుకు అనుమతి లేదు : ప్రవీణ్ కుమార్ (పంచాయతీ కార్యదర్శి, అనిశెట్టిపల్లి)

ఈ నెల 10న జరిగిన పంచాయతీ పాలకవర్గ సమావేశంలో పల్లె ప్రకృతి వనంలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి, ప్రజలు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని మాత్రమే తీర్మానం చేశాం. అయితే అక్కడ ఏపుగా పెరిగిన చెట్లన్నింటినీ నరికివేసినట్లు నా దృష్టికి వచ్చింది. చెట్లను నరికేందుకు ఎవరూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఈ వ్యవహారాన్ని ఇప్పటికే ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లాను. పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా సరే, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

గొల్లపల్లి వేణుగోపాలస్వామి దేవాలయంలో చోరీ....

ఎల్లారెడ్డిపేట నవంబర్ 20(ప్రజా జ్యోతి)

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో గ్రామంలోని వేణు గోపాలస్వామి దేవాలయంలో దొంగలు చొరబడినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. శుక్రవారం ఉదయం భక్తులు స్వామివారి దర్శనం కోసం ఆలయానికి వెళ్లగా, ఆలయ గేటు మరియు తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు.వెంటనే భక్తులు గ్రామ సర్పంచ్ లికొండ రమేష్ గౌడకు సమాచారం అందించడంతో, ఆయన హుటాహుటిన దేవాలయానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం స్థానికులతో వివరాలు తెలుసుకుని, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు



బొప్పాపూర్ లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన .....

సర్పంచ్ గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి

ఎల్లారెడ్డిపేట నవంబర్ 20 ప్రజా జ్యోతి

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేద బడుగు బలహీన వర్గాల వారి కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని రాచర్ల బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు అర్హులైన పేదవారితో నమోదు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వెంకటరెడ్డి వార్డు సభ్యులు గ్రామస్తులు కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు



22వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ప్రజలకు అవగాహన కల్పించిన కౌన్సిలర్ మంద రాధ

జమ్మికుంట, నవంబర్ 20 (ప్రజాజ్యోతి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో దరఖాస్తు ఫారాలను స్వీకరించారు.ఈ సందర్భంగా 22వ వార్డు కౌన్సిలర్ మంద రాధ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం గురించి వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ అసిస్టెంట్ గుల్లి సురేష్, ఆర్పీ రామగిరి ఉమా, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. దరఖాస్తుల సమర్పణ కోసం ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



పేద కుటుంబాలకు భరోసా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

ధర్మారం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి న్యూస్):

ధర్మారం మండలం కమ్మరిఖాన్ పేట గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు భరోసా, భద్రత కల్పించే గొప్ప పథకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రతి అర్హులైన కుటుంబానికి పథకం చేరేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రమోద్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ జీవిత బీమా

మొదటిపేజీ తరువాయి

అనంతరం ప్రభుత్వ కళాశాల మైదానంలో కోకో క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుచూపుతో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కుటుంబ పెద్ద దురదృష్టవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఎలాంటి వివక్ష లేకుండా బీమా సౌకర్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల విషయంలో ప్రజలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదని



విమర్శించారు. వయోవృద్ధులకు సైతం త్వరలో పెన్షన్లు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ.8.30 కోట్ల వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి మరో నాలుగైదు రోజుల్లో భూమిపూజ చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ చిలుక సతీష్, డైరెక్టర్లు, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బీమా దరఖాస్తులో వివరాల నమోదు పక్కాగా ఉండాలి...

మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి... కుటుంబాల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా వేములవాడ అర్బన్ మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీ చీర్లవంచ, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 23 వ వార్డు లో ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయగా, పరిశీలించారు. రిజిస్టర్లు ఏర్పాటు చేసి దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేయగా, పరిశీలించి.. ఎందరు నమోదు చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్లో బీమా వివరాలు నమోదు చేస్తుండగా, పరిశీలించి.. మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యేందుకు ఎంత సమయం పడుతుందో ఆరా తీశారు. సిరిసిల్లలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం



పై అవగాహన కల్పిం చేందుకు రూపొందించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, అధికారులతో కలిసి ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు డిసెంబర్ 19వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొ న్నారు. అన్ని కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ లు ఉన్నాయని వివరించారు. బీమా వివరాల నమోదు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. అర్జీదారులు రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. అన్ని ప్రత్యేక కేంద్రాల్లో బీమా వివరాలు, నామినీ వివరాలు పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, నోడల్ అధికారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల 23వ వార్డు సభ్యురాలు ఆడెపు చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్లు జయంత్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఆనంతారం లో ఇందిరమ్మ బీమాపతకం ప్రారంభించిన సర్పంచ్ రజిత వెంకటేష్

ఇల్లంతకుంట నవంబర్ 20(ప్రజాజ్యోతి)

కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో శుక్రవారం రోజు



గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల అర్హులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించే ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామపంచాయతీ తరపున కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కదం జయంత్,పంచాయితీ కార్యదర్శి మారుతి,కంప్యూటర్ ఆపరేటర్ ఏల రాజు,వార్డు సభ్యులు మల్యాల రాజశేఖర్,బట్టి క్రాంతి,గోనపల్లి లావణ్య వెంకటేశం,మహిళా మండలి సిఏలు వోల్లాల స్వప్న,కదం జయ,అంగన్వాడి టీచర్లు,మంగవ్వ ఎంకవ్వ,ఆశా వర్కర్లు, పద్మ,తారవ్వ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట మండలంలో ఇందిరమ్మ కుటుంబ

జీవిత బీమా పథకం ప్రారంభం

ఇల్లంతకుంట నవంబర్ 20(ప్రజాజ్యోతి)



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లం తకుంట మండలం వెల్జిపూర్ గ్రామంలో మాన కొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్య నారాయణ చేతుల మీదుగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారం భించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండ లంలోని అన్ని గ్రామాల్లో సర్పంచులు ఈ పథకాన్ని ప్రారంభించగా, రేపాక గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుం బాలకు ఆర్థిక భరోసా కల్పించడమే పథకం లక్ష్యమని, కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలవడమే ప్రధా న ఉద్దేశమని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమ హామీ లను అమలు చేస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాత మల్లేశం, ఉప సర్పంచ్ మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సీఏ అనురాధ, వార్డు సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఆత్మగౌరవానికి ప్రతీక...వొడితల ప్రణవ్..

ఇళ్లల్లకు వెళ్లే సమయంలో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేవు..

జమ్మికుంట,మండల పరిధిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు హాజరైన హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్..

జమ్మికుంట, నవంబర్ 20 (ప్రజాజ్యోతి)



ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఇళ్లు కట్టుకోవాలనే వారి కలను నెరవేరుస్తున్నామని,ఇళ్లు ఆత్మగౌరవానికి ప్రతీక అని అలాంటి ఇంటికలను ఇందిరమ్మ ఇంటి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం రోజున జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఎన్నేళ్ల నుంచో సొంతిల్లు కట్టుకోవాలని కోరిక ఉండేదని ఆ కోరిక కాంగ్రెస్ ప్రభుత్వం,ప్రణవ్ నెరవేర్చారని అన్నారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళా నాయకురాళ్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకంతో పేద మధ్యతరగతి కుటుంబాలకు

ఆర్థిక భరోసా

మునిసిపల్ చైర్మన్, పుల్కాం రాజు

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.



వేములవాడ పట్టణం లోని 15 వ వార్డ్ సంతోష్ నగర్, 25వ వార్డ్ లో కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాహాజరైనమున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కుటుంబానికి అండగా నిలిచే వ్యక్తి అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా జీవిత బీమా పథకం ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు ప్రతి అర్హులైన కుటుంబం యజమాని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు.ప్రజల సంక్షేమం,భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తుంది అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటుబిల్లు ,ఇందిరమ్మడబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇల్లు లేక ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం,రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం, చేయూత పథకం ద్వారా అర్హులకు సామాజిక భద్రత పించన్లు, మరి ఇంకా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను ప్రజల కోసం చేపట్టిందని చైర్మన్ అన్నారు.ప్రజలకు భరోసా కల్పించే ఇలాంటి పథకాలను తీసుకవస్తున్న ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు సుధీర్,మల్లేశం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకు చేరిన ఎండు రొయ్యలు, వట్టి చేపల విక్రయాలు

పల్లిమక్తలో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక విక్రయ స్టాల్

కోనరావుపేట, నవంబర్.20(ప్రజాజ్యోతి)

కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఈరోజు ఎండు రొయ్యలు, వట్టి చేపల విక్రయాలను చేపట్టారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి ఎండు రొయ్యలు, వట్టి చేపలను ప్రజలకు అందుబాటులో ఉంచి విక్రయించారు.ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎండు రొయ్యలు, చేపలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలని, వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయని వివరించారు. ప్రజలకు నాణ్యమైన చేపల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రామంలో విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు.ఈ విక్రయాలకు గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పలువురు ప్రజలు ఆసక్తిగా ఎండు రొయ్యలు, వట్టి చేపలను కొనుగోలు చేశారు. గ్రామస్థులకు నేరుగా అందు బాటులోకి వచ్చి విక్రయాలు చేపట్టడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిన్న రమేష్, ఎనగంటి నారాయణ, జిన్న అర్జున్,జిన్న సత్తయ్య,చిద్రవేణి ప్రభాకర్, రేగుల పరశురాము లు, జిన్న దుర్గయ్య, ఎనగంటి రాజేషశీ, తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన పింగిలి రమేష్ -- రమ దంపతులు

వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరు

జమ్మికుంట, నవంబర్ 20 (ప్రజాజ్యోతి)

జమ్మికుంట పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న దినేష్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన వివాహ వేడుకలో కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్ -- రమ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. నినాదం రిపోర్టర్, హుజురాబాద్ ఆర్ సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ కుమార్తె వివాహ మహోత్సవానికి వారు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం కొనసాగాలని ఆకాం క్షించారు. జీవితంలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న వధూవరులు పరస్పర ప్రేమానురాగాలు, అన్యోన్యతతో ఆదర్శ దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



పెద్దలింగాపూర్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

ఇల్లంతకుంట నవంబర్ 20(ప్రజాజ్యోతి)

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఆదుకోవడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని అర్హులైన కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు, సీఏలు, అంగన్వాడీ టీచర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



శుభకార్యాల్లో పాల్గొన్న వోడితల ప్రణవ్ బాబు

వీణవంక, నవంబర్ 20(ప్రజాజ్యోతి)

హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వోడితల ప్రణవ్ బాబు వీణవంక మండలంలో పలు శుభకార్యాలకు హాజరై సందడి చేశారు. వివాహ వేడుక, నిశ్చితార్థ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడంతో పాటు కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు.శుక్రవారం మధ్యాహ్నం వీణవంక గ్రామంలోని శివాలయంలో సుబ్రమణ్య శర్మ కుమార్తె వివాహ వేడుకకు హాజరైన వోడితల ప్రణవ్ బాబు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వాల్బపూర్ గ్రామంలో పల్లె వీణ సమ్మయ్య కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఇరు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడిన ప్రణవ్ బాబు, నూతన వధూవరుల జీవితాలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, చిన్నాల ఐలయ్య, డైరెక్టర్లు శ్రీపతి రెడ్డి, సునీల్, జైపాల్ రెడ్డి, పోరెడ్డి తిరుపతిరెడ్డి, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నామిని విజయేందర్, చాడ రాజేందర్ రెడ్డి, నాలి సంపత్, బావు రాకేష్, నాలి రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిరక్షణకు ముందుకొచ్చిన ఎమ్మెల్సీ కవిత....

శాతవాహన యూనివర్సిటీకి లక్ష 30,800 చెల్లింపు.... టిఆర్ఎస్ ఔదార్యం....

ఎల్లారెడ్డిపేట నవంబర్ 20 (ప్రజా జ్యోతి):



ఎల్లారెడ్డిపేట గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. శాతవాహన యూనివర్సిటీకి చెల్లించాల్సిన ఫీజు బకాయిలు చెల్లించలేని పరిస్థితి నెలకొనడంతో కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయాన్ని గుర్తించిన కళాశాల పరిరక్షణ సభ్యుడు రంజిత్ సమస్య పరిష్కారం కోసం టిఆర్ఎస్ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ మజీద్ దృష్టికి తీసుకెళ్లారు.మజీద్ ఈ సమస్య తీవ్రతను టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిరక్షణకు తనవంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చారు. శాతవాహన యూనివర్సిటీకి చెల్లించాల్సిన రూ.1,30,800 మొత్తాన్ని చెల్లించి కళాశాలకు అండగా నిలిచారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా కళాశాల మనుగడకు ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో ఎమ్మెల్సీ కవిత స్పందించి ఆర్థిక సహాయం అందించడం పట్ల కళాశాల పరిరక్షణ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ప్రభుత్వ కళాశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. సమయానికి అందిన ఈ ఆర్థిక సహాయం కళాశాలకు ఊరటనివ్వడమే కాకుండా విద్యార్థుల చదువులకు భరోసానిచ్చింది. కళాశాలను కాపాడుకోవడానికి ముందుకు వచ్చి రుసుమును చెల్లించిన టిఆర్ఎస్ అధినేత కవితకు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు అల్లె శంకర్ , కదిరె రేణుక ,మౌనిక ,జావిద్ ,కదిరె భాస్కర్, శ్రీహరి సాయి ప్రేమ్ సత్యం రెడ్డి ,రాజేష్ ,హాజీ బాబా, భూపతి ,అరుణ్ రెడ్డి ,షబానా మల్లవ్వ ,దేవేంద్ర ,పరుశరాములు, అంకుష్ తదితరులు పాల్గొన్నారు

వరి కొయ్యలు కాల్చిన వివాదం.. దంపతులపై కర్రతో దాడి, రక్తగాయాలు

మామిడి చెట్టుకు మంటలు అంటుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఇల్లంతకుంట నవంబర్ 20(ప్రజా జ్యోతి)

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పరిధిలోని చిక్కుడువానిపల్లి గ్రామంలో వరి కొయ్యలు కాల్చిన విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు రక్తగాయాలు కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.గ్రామానికి చెందిన లాల రమేష్ తన వరి పొలంలో పంట కొయ్యలను కాల్చడంతో పక్కనే ఉన్న మామిడి చెట్టుకు మంటలు అంటుకున్నాయి. దీంతో మామిడి చెట్టు యజమాని కంకటి మొండయ్య, అతని భార్య మనెవ్వ ఆగ్రహానికి గురయ్యారు.ఈ క్రమంలో గురువారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో లాల రమేష్ ఇంటికి వెళ్లి మంటలు అంటుకున్న విషయమై గొడవకు దిగారు. మాటామాటా పెరగడంతో కంకటి మొండయ్య కర్రతో రమేష్, అతని భార్య మంగపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిలో వారిద్దరికీ రక్తగాయాలైనట్లు సమాచారం.బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, దాడికి సంబంధించిన వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు

శ్రీరామ నామస్మరణతో మారుమోగిన ఎల్లారెడ్డిపేట సత్సంగ సదనం.

రామకోటి స్తూపంలో లిఖిత రామకోటిని సమర్పణ.....సత్సంగ సదనం అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి....

ఎల్లారెడ్డిపేట నంబర్ 20(ప్రజా జ్యోతి)

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. సత్సంగ సదనం 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞంలో భాగంగా గురువారం పట్టణంలో ఘనంగా నగర సంకీర్తన నిర్వహించారు.కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ ఏకాదశి వరకు నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞంలో ప్రముఖ పౌరాణిక ప్రవచనకర్త, శ్రీ శృంగేరి శారదాపీఠం ఆస్థాన పౌరాణికులు, బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రియ శిష్యులు బ్రహ్మశ్రీ డాక్టర్ ఘర్రేపల్లి మహేశ్వర శర్మ భక్తులకు భాగవత ప్రవచనాలను సులభంగా, మనసుకు హత్తుకునేలా వివరిస్తూ ఆధ్యాత్మిక బోధనలు చేశారు.నగర సంకీర్తనలో భాగంగా ఎల్లారెడ్డిపేట ప్రధాన వీధుల మీదుగా నంది విగ్రహం, గాంధీ విగ్రహం, మార్కండేయ ఆలయం, పాత అంగడి బజార్ మీదుగా భక్త సంఘం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హరేరామ హరేరామ రామ రామ హరే హరే.. హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే అంటూ భజనలు, రామనామ సంకీర్తనలతో గ్రామ వీధులు మారుమోగాయి. ప్రత్యేక వాహనంపై సత్సంగ సదనం వ్యవస్థాపకులు, రామభక్తులు శ్రీశ్రీశ్రీ సరస్వతీ గోవిందరాజుల చిత్రపటాన్ని ఊరేగించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం రామకోటి స్తూపం వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో రాసుకొని తీసుకొచ్చిన లిఖిత రామకోటిని భక్త సంఘం అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్తూపంలో సమర్పించారు. ప్రభోధ ఏకాదశి సందర్భంగా భగవన్నామ మహిమను వివరిస్తూ ఆయన భక్తులకు ఆధ్యాత్మిక సందేశం అందించారు.అనంతరం హరికథా భాగవతారిణి వావిలాల నాగరాణి రుక్మిణీ కల్యాణం హరికథను భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించి అలరించారు.ఈ కార్యక్రమంలో భక్త సంఘం ప్రతినిధులు నగుబోతు శ్రీనివాస్ గుప్తా, గుంప నాగేంద్ర గుప్తా, బండారి బాల్ రెడ్డి, పోతు ఆంజనేయులు, గోశిక దేవదాసు, మేఘి నరసయ్య, రాము గుప్తా, రామిరెడ్డి సార్, రవీందర్ రావు, గుండం రాజిరెడ్డి, ద్యాప దేవయ్య, కిషన్ రావుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే లక్ష్యంగా వేములవాడ రూరల్‌లో రూ.3.94 కోట్లతో వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి పనులకు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేముల రూరల్ మండల పరిధిలో మర్రిపల్లి గ్రామంలో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి పనులకు రూ. 3.94 కోట్ల నిధులు మంజూరు కాగా, ఈ పనులకు విప్ శంకుస్థాపన చేశారు.వేములవాడ పట్టణంలో మార్కెట్ యార్డ్ లో 75 లక్షలతో నిర్మిస్తున్న కవర్ షేడ్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి శంకుస్థాపన చేశారు..ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి సుమారు రూ. 7 కోట్లకు పైగా అంచనాలతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదటి దశలో రూ. 3.94 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టామని, మరో రూ. 3 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చి రెండో దశలో షెడ్ల నిర్మాణం, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవన నిర్మాణం తదితర పనులు చేపడతామని వెల్లడించారు. రైతుల అవసరాల దృష్ట్యా మార్కెట్ యార్డులో అదనంగా రూ. 70 లక్షలతో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు..గతంలో వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించిన స్థలం అనువుగా లేకపోవడంతో స్వయంగా పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా నూతన స్థలంలో మార్కెట్ యార్డు



నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం చేసిన కృషి, ప్రతిపాదనల మేరకు ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించామని చెప్పారు.ప్రజా జీవితంలో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ మనం ప్రజల కోసం చేసిన పనులే చిరకాలం గుర్తుండిపోతాయని ఆది శ్రీనివాస్ అన్నారు. సర్పంచి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ఏ హోదాలో ఉన్నా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు సమష్టిగా కృషి చేసి రైతుల కోసం మంచి మార్కెట్ యార్డు నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.

వేముల రూరల్‌కు నూతన ఎమ్మార్వో కార్యాలయం

వేములవాడ రూరల్ మండలానికి నూతన ఎమ్మార్వో కార్యాలయం మంజూరైందని, ఇందుకోసం రూ. 2 కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. శాత్రాజ్‌పల్లి, చెక్కెపల్లి, మర్రిపల్లి, హనుమాజీపేట తదితర నాలుగు మార్గాల నుంచి వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేస్తున్నామని చెప్పారు.ఎకరం భూమిని ఎమ్మార్వో కార్యాలయ నిర్మాణానికి కేటాయించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరగా, మార్కెట్ కమిటీ పాలకవర్గం కూడా అంగీకరించిందని తెలిపారు. కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే కార్యాలయ నిర్మాణానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.

నియోజకవర్గంలో నాలుగు నూతన సింగిల్ విండోలు

రైతులకు సహకార సేవలను మరింత చేరువ చేసేందుకు నియోజకవర్గంలో చెక్కెపల్లి, రుద్రంగి, కతలాపూర్, మన్నెగూడెం ప్రాంతాల్లో నూతన సింగిల్ విండో కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం ఆరు ప్రాంతాలకు ప్రతిపాదనలు పంపగా, నాలుగు ప్రాంతాల్లో అనుకూలత ఉండటంతో మంజూరు లభించిందన్నారు. మిగిలిన రెండు ప్రాంతాల్లోనూ భవిష్యత్తులో రైతుల ఖాతాలు, బ్యాంకింగ్ సేవలు పెరిగినప్పుడు సింగిల్ విండోలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతును రాజుగా చూడాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆది శ్రీనివాస్ అన్నారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రజలు ఉపయోగించుకోవాలి

- మట్టి పాత్రలను ఉపయోగించుకొని వ్యాధుల నుండి కాపాడుకోవాలి

- కె వి ఐ సి కోఆర్డినేటర్ సంజీవరావు

మంథని, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):



ఖాదీ పరిశ్రమల గ్రామీణ పరిశ్రమల ద్వారా సూక్ష్మ, లఘు, మధ్యతర పరిశ్రమల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు ముందుకు వస్తే వారికి సబ్సిడీతోపాటు రుణ సౌకర్యాలను ఇచ్చి స్వయం ఉపాధికి కృషి చేయడం జరుగుతుందని కెవిఐసి కోఆర్డినేటర్ సంజీవరావు అన్నారు. పెద్దపల్లి జిల్లా స్థాయి లో మంథని మండలం సూరయ్యపల్లి లో కుమ్మర వృత్తిపై కె.వి.ఐ.సి ఆధ్వర్యంలో గత పది రోజుల క్రితం ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం శుక్రవారం జరిగిన ముగింపు సమావేశానికి కెవిఐసి కోఆర్డినేటర్ సంజీవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదీ గ్రామీణ పరిశ్రమల ద్వారా వివిధ వృత్తుల కు సబ్సిడీతో రుణ సౌకర్యాలను ఇచ్చి స్వయం ఉపాధికి కృషి చేయడం జరుగుతుందని ఈ అవకాశాల్ని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. కుమ్మర కులవృత్తి పై పది రోజులపాటు శిక్షణ పొందిన యువతి యువకులు మంచి నైపుణ్యంతో కుల వృత్తి తో చేసే మట్టి పాత్రలను వినియోగించుకొని వివిధ వ్యాధుల నుండి కాపాడుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ అల్యూమినియం పాత్రలతో పలు వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నందున మట్టి పాత్రలను ఉపయోగించి వ్యాధుల నివారణకు ప్రజలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టి.కె. శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆషాడపు లింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కటికనపల్లి రవీందర్, సూరయ్యపల్లి గ్రామ సర్పంచ్ ఆర్ల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రేణుక, కుమ్మర కులవృత్తి శిక్షణ దారుడు రాతిపల్లి నాగేష్, రేపాక శంకర్ ,కల్వచర్ల రాజేందర్, రేపాక రాములు , వెంకటేష్, మల్లయ్య, ఇందారపు రాజు ,రవళి, కనకతార, శ్యామల, రాధ లు పాల్గొన్నారు.

ప్రతి పనికి గడువు విధించి.. వేగంగా పూర్తి చేయాలి

వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో ప్రతి దానికి గడువు విధించి.. వేగంగా పూర్తి చేయాలని వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశిం చారు. వేములవాడ పట్టణంలో వేముల వాడ టెంపుల్ ఏరియా డెవల ప్మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వ ర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి శుక్రవారం ఆర్ అండ్ బీ, దేవాదాయ శాఖ, ఎన్ పీ డీ సీ ఎల్, వేములవాడ మున్సిపల్ అధికారులతో ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి ప్రత్యేకంగా కూలీల సంఖ్య పెంచాలని, పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు నిత్యం అభివృద్ధి పనులను పరిశీలిస్తూ.. వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల్లో మిగతావి ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో దేవాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

ధాన్యం కొనుగోళ్లలో 41 కిలోలకు మించి తూకం వేయొద్దు

పెద్దపల్లి పట్టణంలో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 20

ప్రజా జ్యోతి:



చింతకుంట విజయరమణ రావు, రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, యాసంగిలో తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు గౌరెడ్డిపేట బీటీ రోడ్డు నుంచి శాంతినగర్ బ్రిడ్జి వైపు రూ. 30 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పెద్దపల్లి మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాలను ముందుగానే అంచనా వేసి వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటల ప్రయోజనాలను వివరించాలని, అనువైన పంటల ఎంపిక, సాగు పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలన్నారు. గ్రామ సర్పంచులు కొనుగోలు కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి రైతులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ధాన్యం తూకంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, 41 కిలోలకు మించి తూకం వేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. రైతుల నుంచి అదనపు ధాన్యం తీసుకోకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలన్నారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన అర్హులను గుర్తించి పారదర్శకంగా లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ప్రభుత్వ విప్ విజయరమణ రావు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ రాజయ్య, పెద్దపల్లి, అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్లు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కుటుంబ నమోదు సర్టిఫికెట్ల పంపిణీ

తిమ్మాపూర్, నవంబర్ 20(ప్రజాజ్యోతి):-

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు కుటుంబ జీవిత బీమా పథకం కుటుంబ నమోదు సర్టిఫికెట్లను గ్రామ సర్పంచ్ ఎలుక అంజనేయులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తికి ఏదైనా అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా గ్రామపంచాయతీ తరపున నిరంతరం కృషి చేస్తామని, ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు ఎ.పి.వో చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ శ్రీధర్,టి.ఏ హరీష్,కారోబార్ చింతల శ్రీనివాస్ మరియు గ్రామ ప్రజలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు



22న కరీంనగర్‌లో డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

- పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఉడుత ముకుందం

మంథని నవంబర్ 20 (ప్రజాజ్యోతి):



ఈ నెల 22న కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని పెద్దపల్లి జిల్లా అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ఉడుత ముకుందం కోరారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా అతిథి అధ్యాపకుల అధ్యక్షుడు ఉడుత ముకుందం మాట్లాడుతూ గెస్ట్ లెక్చరర్ల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆకాంక్షించారు. హక్కుల సాధనకు అధ్యాపకులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాలకు చెందిన గెస్ట్ లెక్చరర్లు ఈ సమావేశంలో పాల్గొనే కార్యక్రమానికి టిసిఈ జేఏసి చైర్మన్ డాక్టర్ కె. సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఉద్యోగ భద్రత, వేతనాలు, సర్వీస్ రెన్యువల్ తదితర సమస్యలపై చర్చించడంతో పాటు, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. నాలుగు ఉమ్మడి జిల్లాల గెస్ట్ లెక్చరర్లు పెద్ద సంఖ్యలో హాజరై ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

ప్రొద్దుతిరుగుడు, పప్పు దినుసుల సాగును ప్రోత్సహిస్తున్న వ్యవసాయ శాఖ

ఇల్లందకుంట, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):



ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. ఇందులో భాగంగా నూనె గింజలు, పప్పు దినుసుల పంటల సాగును వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రొద్దుతిరుగుడు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఎకరానికి రెండున్నర కిలోల చొప్పున పంపిణీ చేసేందుకు మొత్తం 60 ఎకరాలకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు.అదేవిధంగా జమ్మికుంటలోని రైతు ఆగ్రోస్, కొత్తపల్లిలో శనగలు, పెసర్లు, మినుములకు సంబంధించిన టీఎస్ సీడ్స్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు

బి టీ ఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాల విద్యార్థులకు అరటి పండ్లు పంపిణి చేసిన సర్పంచ్

ఇల్లంతకుంట నవంబర్ 20(ప్రజాజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చదువు, విజ్ఞానం, మానసిక ఉల్లాసంతో పాటు పౌష్టిక ఆహారం అందించాలనే సదుద్దేశంతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల నర్స క్కపేట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బెంద్రం.శంకరమ్మ బెంద్రం తిరుపతి రెడ్డి పౌండేషన్ ద్వారా అరటి పండ్లు పంపిణి చేశారు .ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతి శుక్రవారం విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాధానో పాధ్యాయుడు , ఉపాధ్యాయులు , గ్రామా కార్యదర్శి అంగన్వాడీ టీచర్లు, ప్రజలు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యల పరిష్కారానికే సబ్ స్టేషన్ ఏర్పాటు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా ప్రారంభం

వెలిచాలలో సబ్ స్టేషన్ కు శంకుస్థాపన...

రామడుగు, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి సబ్ స్టేషన్ మంజూరు చేశామని చెప్పాలని నియోజక వర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం వెలిచాల గ్రామంలో 32/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఈ సబ్ స్టేషన్ పూర్తయితే లో వోల్టేజ్ సమస్య తొలగిపోయి, రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందుతుందని అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి పనులు వరుసగా చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వీర్ల నర్సింగరావు, స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి, ఎమ్మార్వో దాసరి రాజ మల్లయ్య, ఎంపీడీవో రాజేశ్వరి,విద్యుత్ శాఖ అధికారులు ఈ ఈ శ్రీనివాస్, ఏడిఈ అనిల్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కోలా రమేష్,కాంగ్రెస్ నాయకులు ఒంటెల మురళీకృష్ణ రెడ్డి,మాజీ సర్పంచ్ కడే శంకర్, జక్కుల బాబు, కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన సర్పంచ్ ఆవుల మల్లయ్య

ధర్మారం, నవంబర్ 20 (ప్రజాజ్యోతి న్యూస్):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తోంది. ఇందులో భాగంగా ధర్మారం మండలం నరసింహులపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి కుంట రాజమణి--మల్లయ్య దంపతులు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ ఆవుల మల్లయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.సొంతింటి కల నెరవేరడం ప్రతి పేద కుటుంబానికి ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు నూతన గృహాలను నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. సొంత ఇంటిలోకి అడుగుపెట్టిన రాజమణి--మల్లయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కత్తెర లచ్చయ్య, వార్డు సభ్యులు పోలం ప్రసాద్, గ్రామ కార్యదర్శి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట్‌లో 'ఖేత్ బచావో అభియాన్'

చిగురుమామిడి/నవంబర్ 20, ప్రజా జ్యోతి,

వ్యవసాయ భూముల పరిరక్షణ, నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో చిగురుమామిడి మండలం లోని నవాబుపేట్ రైతువేదికలో సర్పంచ్ గుళ్ల రజిత రాజు అధ్యక్షతన "ఖేత్ బచావో అభియాన్" నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ మాట్లాడుతూ.. రైతులు రసా యన ఎరువుల వాడకాన్ని తగ్గించి, పర్యావరణహిత వ్యవసాయం చేయాలని సూచించారు.కరీంనగర్ టి అర్ వి కే శాస్త్రవేత్త మధుకర్ రావు, జమ్మికుంట కే వి కే శాస్త్రవేత్త మహేష్ మాట్లాడుతూ.. ఎల్ నినో దృష్ట్యా తక్కువ నీటితో పండే కూరగాయలు, జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పొద్దుతిరుగుడు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఏడీఏ ఎన్. శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్, ఉప సర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పిల్లి కొమురయ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి వార్డులో ఆన్‌లైన్ నమోదు.. అర్హులకు ఇందిరమ్మ చేయూత పింఛన్ పత్రాల పంపిణీ

జమ్మికుంట, నవంబర్ 20 (ప్రజాజ్యోతి)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ అన్నారు. భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ఇందిరమ్మ చేయూత పథకాలను ప్రారంభించిందని తెలిపారు. కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలిచేందుకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.ఈ నేపథ్యంలో శు క్రవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో వార్డు అధికారులు, వార్డు కౌన్సిలర్ల సమన్వయంతో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నమోదు చేసుకోవాలని సుంకరి రమేష్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి 17వ వార్డులో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, వార్డు కౌన్సిలర్‌తో కలిసి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ చేయూత పింఛన్ పత్రాలను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



గొల్లపల్లిలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ నమోదు ప్రారంభం.....

ఎల్లారెడ్డిపేట నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

గొల్లపల్లి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, ఉపసర్పంచ్ పున్నాల మనమ్మ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో పాటు ఇంటి పెద్ద (లబ్ధిదారుడు), నామినీ ఇద్దరూ కలిసి గ్రామపంచాయతీకి వచ్చి ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, లబ్ధిదారులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారమే రాజన్న ఆలయ అభివృద్ధి

శృంగేరి పీఠం సూచనలే మాకు మార్గదర్శకం

రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లతో ప్రణాళిక

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.



రాజన్న ఆలయ అభివృద్ధిపై వస్తున్న విమర్శలనుపై ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు పూర్తిగా ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగానే చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీ శ్రీ భారతీ తీర్థ స్వామి, శ్రీ శ్రీ విధుశేఖర భారతి స్వామివారి సూచనలు, ఆదేశాల మేరకే అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు.వేములవాడ పట్టణంలో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి పాల్గొన్న ఆది శ్రీనివాస్ అనంతరం రాజన్న ఆలయ అభివృద్ధిపై మాట్లాడారు.ఆలయ అభివృద్ధి విషయంలో భక్తులు, పెద్దలు, సంబంధిత వర్గాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతు న్నామని తెలిపారు. ఆలయ ప్రాచీనత, విశిష్టత, ప్రాశస్త్యానికి ఎలాంటి భంగం కలగకుండా పనులు చేపడు తున్నామని పేర్కొన్నారు. సప్తమి నాడు పనులు జరిగితే అష్టమి నాడు చేపట్టినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, భక్తులు ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని కోరారు.గతంలో రాజన్న ఆలయ శిఖరం శిలామయంగా ఉండేదని, 1970 దశకంలో దానిని తొలగించి ఇటు కలతో నిర్మించినట్లు చర్చల్లో వెల్లడైందని తెలిపారు. శృంగేరి పీఠం సూచనల మేరకు ప్రస్తుతం తిరిగి శిఖరాన్ని శిలామయంగా నిర్మించే ప్రక్రియను చేపట్టి నట్లు వివరించారు. శిఖరానికి సంబం ధించిన కార్యక్రమాలు, కలశానికి ధాన్య వాసం, గర్భగుడిలో ప్రతిష్ఠ వంటి కార్య క్రమాలన్నీ ఆగమ శాస్త్ర నియమాల ప్రకారమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు, ప్రభుత్వ యంత్రాంగం, ఆలయ అధికా రులు, సలహాదారులు అందరూ ఆగమ శాస్త్ర మార్గదర్శకత్వంలోనే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధిపై ఎవరి వ్యక్తిగత నిర్ణయాలకు తావులేదని, శృంగేరి పీఠం సూచనలే తమకు మార్గదర్శకమని స్పష్టం చేశారు.విమర్శలకు విమర్శలతో సమాధానం చెప్పడం తమ ఉద్దేశం కాదని, భక్తులకు వాస్తవాలను వివరించడమే బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే నేరుగా అడిగి తెలుసుకోవాలని సూచించారు. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం అవసరమైతే పది మెట్లు దిగజారడానికి కూడా సిద్ధంగా ఉన్నామని, తమ లక్ష్యం ఆలయ అభివృద్ధి మాత్రమేనని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. సుమారు రూ. 250 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న ట్లు వెల్లడించారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న

మంథని, నవంబర్ (ప్రజాజ్యోతి):



రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు ప్రభుత్వ మద్దతు ధర కల్పించడమే లక్ష్యం అని మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న అన్నారు. మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసామని తెలిపారు. రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు అమ్మి నష్టపోవద్దని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమవుతుందని స్పష్టం చేశారు. ఎల్ నినో పరిస్థితుల్లో నేపథ్యంలో ఈసారి పొలాల్లోనే వ్యాపారులు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని, రైతులకు ఈసారి పెట్టిన పెట్టుబడికి తగినట్లుగా అత్యధిక మద్దతు ధర లభిస్తుందని అన్నారు. ప్రజా పాలనలో రైతుల పంటకు మంచి ధర లభించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని, రైతు కూలీ సుఖంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, రైతుల సమస్యల పరిష్కారం కోసం శ్రీధర్ బాబు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఎదుర్కొం టున్న ప్రతి ఇబ్బంది తమ దృష్టిలో ఉందని వాటిని త్వరగా పరిష్కరించే దిశగా మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. నిరంతరం రైతుల గురించి ఆలోచించే వ్యక్తి రైతులు సుభిక్షంగా ఉండాలని తపన పడే మన నాయకుడు మంత్రి శ్రీధర్ బాబు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యుడు శశిభూషణ్ కాచే, ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ రమ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజీమ్ ఖాన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు బండారి ప్రసాద్, ఆరెల్లి కిరణ్ గౌడ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ వేళ విద్యుత్ పునరుద్ధరణలో మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ విశేష సేవలు

స్కిల్డ్ వర్కర్స్ బృందంతో కోనసీమలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సత్యం పవర్ సిస్టమ్స్ చైర్మన్‌కు ఘన సన్మానం

సుల్తానాబాద్, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):

ఆర్నాబ్ తుఫాన్‌తో అతలాకుతలమైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సత్యం పవర్ సిస్టమ్స్ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ విశేష కృషి చేశారు. తుఫాన్ కారణంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో తన స్కిల్డ్ వర్కర్స్ బృందంతో హుటాహుటిన కోనసీమకు చేరుకుని పునరుద్ధరణ పనుల్లో కీలక పాత్ర పోషించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కార్మికులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ సరఫరాను తిరిగి అందుబాటులోకి తీసుకురావడంలో అంకిత భావంతో సేవలందించారు. ఈ సేవలను గుర్తించిన కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ విజేందర్ రెడ్డి మిట్టపల్లి ప్రవీణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. అలాగే కాంట్రాక్టర్లు భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌టీ మీటర్స్ ఏడీఈ దరావత్ రవిని సైతం సన్మానించారు. ప్రజాసేవలో విద్యుత్ కార్మికులు, కాంట్రాక్టర్ల అంకితభావం అభినందనీయమని ఎస్ఈ పేర్కొన్నారు.



వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.?దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, 10వ రోజు వేడుకలను ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుమార్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు మరియు అర్చకులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లు ఆత్మగౌరవానికి ప్రతీక

లబ్ధిదారుల సొంతింటి కలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వొడితల ప్రణవ్

ఇల్లందకుంట, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతిల్లు నిర్మించుకోవాలనే పేదల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని, ఇల్లు అనేది ప్రతి ఒక్కరి ఆత్మగౌరవానికి ప్రతీక అని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం ఇల్లందకుంట మండల కేంద్రంతో పాటు లక్ష్మాజిపల్లి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు, నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసే కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు నిర్మించుకోవాలనే కోరిక ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమ కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, గ్రామ సర్పంచులు, జమ్మికుంట పట్టణ నాయకులు, ఇల్లందకుంట మండల కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



రాష్ట్రస్థాయి కబడ్డీకి దరియాపూర్ విద్యార్థుల ఎంపిక

జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటిన మణికంఠ, మారి.శ్రీశాంత్

విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ముత్తారం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ముత్తారం మండలం దరియాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికై సత్తా చాటుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థి మణికంఠ, అండర్-14 విభాగంలో పదో తరగతి విద్యార్థి మారిశ్రీశాంత్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్, మండల విద్యాధికారి హరిప్రసాద్, మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వెంకటేష్, మండల, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను అభినందించారువిద్యార్థుల ప్రతిభ దరియాపూర్ మోడల్ స్కూల్‌తో పాటు ముత్తారం మండలం, పెద్దపల్లి జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్డు కల నెరవేర్చిన ప్రభుత్వ విప్

మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్.

కాల్వశ్రీరాంపూర్ నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని దేవన్నకుంట నుండి. చిన్న రాతుపల్లి గ్రామం వరకు. నూతన రోడ్డు మరమ్మతుకు .4 కోట్ల 90 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి. ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కళ ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణ రావు నెరవేర్చాడని. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు కొనియాడారు. నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేణ సదయ్య. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బంగారి రమేష్. సర్పంచులు జిన్న రామచంద్రారెడ్డి. అరెల్లి రమేష్... గాజుల మోహన్. ఉప సర్పంచ్ ధర్మల రవి. స్వామి... మాజీ సర్పంచ్ మాదాసి సతీష్. మాజీ ఎంపీటీసీ పొట్యాల మొండయ్యకాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుమునీర్ కరీముద్దీన్. తాండ్ర గోవర్ధన్ .కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు. రైతులు తదితరులు పాల్గొన్నారు.



కేశనపల్లిలో భూభారతి రీసర్వేపై ఆర్డీవో క్షేత్రస్థాయిలో సర్వే పనుల పరిశీలన

సర్వేయర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న కె. సురేష్

ముత్తారం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

భూభారతి రీసర్వేలో భాగంగా ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల పునఃసర్వే పనులను మంథని ఆర్డీవో కె. సురేష్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని వ్యవసాయ భూముల వద్దకు చేరుకుని సర్వే నిర్వహణ తీరును పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ముత్తారం మండల తహసీల్దార్, గిర్దావర్ రాజబాబు, జీపీవో కర్ణాకర్, సర్వేయర్లతో ఆర్డీవో సమావేశమై రీసర్వే పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో చేపడుతున్న కొలతలు, సర్వే నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి రీసర్వే ప్రక్రియలో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ పరిశీలనలో ముత్తారం మండల రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



ఏఐసిసి కార్యదర్శిగా మరియు కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి గానియమితులైన సయ్యద్ హుస్సేన్ .....

ఎల్లారెడ్డిపేట నవంబర్ 20(ప్రజా జ్యోతి)



ఎల్లారెడ్డిపేట మండల కేంద్ర కార్యాలయంలో కర్ణాటక ఇన్చార్జిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి పార్టీ సేవలో గుర్తించి ఉన్న స్థానంలో నియమించి నందుకు పార్టీ అధ్య క్షుడు మల్లికార్జున కార్గి కి రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు

వార్షిక లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

ఉద్యోగులకు దిశానిర్దేశం చేసిన గోదావరి అర్బన్ బ్యాంక్ ఎండీ ధనంజయ తాంబేకర్

సుల్తానాబాద్, నవంబర్ 20:(ప్రజా జ్యోతి)

పెద్దపల్లి, సుల్తానాబాద్ గోదావరి అర్బన్ బ్యాంక్ వార్షిక వ్యాపార లక్ష్యాలను నిర్దేశిత సమయంలో సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ధనంజయ తాంబేకర్ సూచించారు. వార్షిక లక్ష్యాల సమీక్షా సమావేశంలో భాగంగా శుక్రవారం ఆయన పెద్దపల్లి , సుల్తానాబాద్ శాఖను సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ బ్యాంకు నిర్దేశించిన లక్ష్యాల సాధనతో పాటు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రుణాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, మంజూరు చేసిన రుణాలను సకాలంలో తిరిగి వసూలు చేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కొమ్ము రమేష్, అంతటి చిరంజీవి గౌడ్ ప్రధాన కార్యాలయ సిబ్బంది విజయ్‌కుమార్, చించోల్కర్, బ్యాంక్ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.



గ్రంథాలయాలు విజ్ఞానానికి ఆలయాలు

ఉన్నత స్థితికి ఎదగాలంటే పుస్తక పఠనం ఎంతో అవసరం

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి: దారం శ్రీనివాస్ రెడ్డి

కరీంనగర్, నవంబర్ 20(ప్రజాజ్యోతి)

గ్రంథాలయాలు విజ్ఞానానికి ఆలయాలని, జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలంటే నిరంతర పుస్తక పఠనం ఎంతో అవసరమని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దారం శ్రీనివాస్ రెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, తెలంగాణ వ్యవస్థక అధ్యక్షుడు ముదిగంటి సుధాకర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. శశిజాదేవి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు మనిషి జీవితానికి దిశానిర్దేశం చేసే గొప్ప మార్గదర్శకాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా అజ్ఞానం తొలగిపోయి విజ్ఞానం పెంపొందుతుందని, విజ్ఞానవంతులు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారని అన్నారు. దొంగలు దోచుకోలేని సంపద విజ్ఞానమని, ఇతరులకు పంచిన కొద్దీ మరింత పెరిగేది జ్ఞానమని వివరించారు.ప్రభుత్వ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రముఖులంతా ఏదో ఒక దశలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నవారేనని తెలిపారు.టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు టీవీలు, సినిమాలతో విలువైన సమయాన్ని వృథా చేయకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను వినియోగించుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

196 మంది మందు బాబులకు జరిమానాలు.

వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్.

వేములవాడ,నవంబర్,20:ప్రజాజ్యోతి.



వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 196 మందికి ఈరోజు వేములవాడ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ మేఘన వారికి జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ మాట్లాడుతూ...మద్యం సేవించి, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై తమ కుటుంబాలలో, ఎదుటి వారి కుటుంబాలలో విషాదం నింపవద్దని హెచ్చరించారు.మద్యం సేవించి వాహనం నడిపిన కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లిపీఎం రహత్ , రహవీర్ పథకాల గురించి వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సహాయం అందించడం, గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో వేములవాడ ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా నమోదు ప్రారంభం

24 గ్రామపంచాయతీల్లో నాలుగు విడతలుగా ప్రక్రియ..

కొడిమ్యాల మండలంలో 16,532 రేషన్ కార్డులు

కొడిమ్యాల, నవంబరు 20 (ప్రజాజ్యోతి):



కొడిమ్యాల మండలంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచుల ఆధ్వర్యంలో తొలి విడత నమోదు చేపట్టారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో నాలుగు విడతలుగా నెల రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. మొత్తం 16,532 రేషన్ కార్డులకు నమోదు చేయనున్నారు. తొలి విడతలో ఆరు గ్రామపంచాయతీల్లో 3,921 రేషన్ కార్డులకు గాను తొలిరోజు 473 మందికి ఆన్‌లైన్ నమోదు పూర్త యింది. మిగిలిన గ్రామాల్లోనూ విడతల వారీగా ప్రక్రియ చేపట్టనున్నట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు.

విడతల వారీగా గ్రామాలు:

మొదటి విడత:

కొండాపూర్, నమిలికొండ, రామకిష్టాపూర్, శనివారంపేట, తిప్పాయిపల్లి, తిర్మలాపూర్

రెండో విడత:

చింతలపల్లి, గౌరాపూర్, హిమ్మత్‌రావుపేట, కొడిమ్యాల, నల్లగొండ, శ్రీరాములపల్లి

మూడో విడత:

చెప్యాల,దమ్మయ్యపేట, గంగారాంతండా, కోనాపూర్, నాచుపల్లి,సూరంపేట

నాలుగో విడత:

అప్పారావుపేట,డబ్బుతిమ్మయిపల్లి,నర్సింహులపల్లి, పూడూర్, రాంసాగర్,తుర్కకాశీనగర్

ఒడ్యాడ్‌లో ఇందిరమ్మ భీమా పథకానికి శ్రీకారం

అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం -- సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్

భీమారం: నవంబర్ 20(ప్రజాజ్యోతి)



ఒడ్యాడ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక పథకాలను అమలు చేస్తోందని, అందులో భాగంగా ఈ జీవిత భీమా పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందించేందుకు బస్టాండ్ సమీపంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి, రేషన్ కార్డు ఉన్న అర్హులైన కుటుంబ యజమానులు రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, పీఏసీఎస్ చైర్మన్ ఉరుమడ్ల లక్ష్మణ్, గ్రామ కార్యదర్శులు రమ్య, అశ్విని, స్వప్న, ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ సుమ, ఉపసర్పంచ్ మంతెన భారతి-రాజేందర్, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వీవో ఆశ, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లి మండలంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం...

నాలుగు గ్రామ పంచాయతీల్లో వివరాల సేకరణ..

క్షేత్రస్థాయిలో పరిశీలించిన జెడ్పీ సీఈఓ, ప్రత్యేక అధికారి



ఎండపల్లి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి)

అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ ఎండపల్లి మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. మండలంలోని కొండాపూర్, రాజారాంపల్లి, సూరారం, శానబండ గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారుల వివరాల సేకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి. గౌతమ్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ అధికారి ఎం. రవిప్రసాద్ క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. నాలుగు గ్రామాల్లో జరుగుతున్న నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా పథకానికి దూరం కాకుండా సమగ్రంగా వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో డి. కృపాకర్ మాట్లాడుతూ.. అర్హులైన కుటుంబాల సభ్యులు తమ వివరాల నమోదు, ధ్రువీకరణ కోసం సంబంధిత గ్రామ పంచాయ తీల్లోని సిబ్బ ందిని సంప్రదించాలని ,ప్రభుత్వ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటిరోజు నాలుగు గ్రామాల్లో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య కొండాపూర్ లో 797 మొత్తం రేషన్ కార్డులకు గాను 115 ఆన్లైన్లో నమోదైనవి అలాగే రాజారాంపల్లి లో 604 కు గాను 120 నమోదు అలాగే సూరారం గ్రామంలో 168 కి గాను 72 నమోదు అలాగే శానబండ 102 కార్డులకు గాను 46 మొత్తం 1671 కార్డులకు గాను 353 నమోదైనవని అధికారులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఆర్ ఐ అన్వేష్, వివిధ శాఖల అధికారులు పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పిసిసి కార్యవర్గ సభ్యులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి,నాయకులు గ్రామస్తులు, పాల్గొన్నారు,

బాలల హక్కుల వారోత్సవాలకు ఘనంగా ముగింపు,

1098 హెల్ప్‌లైన్‌పై అవగాహన.. పోటీల విజేతలకు బహుమతులు

వెల్గటూర్, నవంబర్ 20, ప్రజా జ్యోతి,

బాలల హక్కులు, బాలికల భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం జగిత్యాల ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమం వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలల హక్కులు, పరిరక్షణ చట్టాలు, విద్యాహక్కు, రక్షణ, అభివృద్ధి, భాగస్వామ్య హక్కులపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు విజయలక్ష్మి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై హింస, లైంగిక వేధింపుల నివారణ చట్టాలను వివరించారు. బాలికలు సమస్యలు, వేధింపులు ఎదురైతే భయపడకుండా అధికారులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. ఇంచార్జి జిల్లా బాలల పరిరక్షణ అధికారి పడాల సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఆటలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల నృత్యాలు, ఉపన్యాసాలు, నాటికలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ కొండయ్య, పరిరక్షణ అధికారి కరుణశ్రీ, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శ్రవణ్, బాలల పరిరక్షణ విభాగం,సఖి కేంద్రం అధికారులు, పాఠశాల ప్రత్యేక అధికారి దీప, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



డాక్టర్ వి.ఆర్.కె ఫార్మసీ కళాశాలలో ఘనంగా నేషనల్ ఫార్మసీ వీక్ వేడుకలు

ఏఎంఆర్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల భారీ ర్యాలీ..

జెండా ఊపి ప్రారంభించిన ఎస్ఐ సుప్రియ



జగిత్యాల, నవంబర్ 20 ప్రజాజ్యోతి

జగిత్యాల పట్టణంలోని డా. వి.ఆర్.కె. కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నేషనల్ ఫార్మసీ వీక్ మరియు వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది కలిసి ఏఎంఆర్ (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్) పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు.డా. మహమ్మద్ షా ఆలం రసూల్ ఖాన్, చైర్మన్ డా. వి.ఆర్.కె. ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్ ఆదేశాల మేరకు, ప్రొఫెసర్ డా. దండు రామకృష్ణ, డైరెక్టర్ డా. వి.ఆర్.కె. గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కాలేజీల సూచనలతో ఈ కార్యక్రమం జరిగింది.కళాశాల ప్రిన్సిపాల్ డా. హెచ్. పరమేశ్వర్ అధ్యక్షతన, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. మీర్ కాజిమ్ అలీ పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించారు.

- ఎస్ఐ సుప్రియ చేతుల మీదుగా ర్యాలీ ప్రారంభం

జగిత్యాల న్యూ బస్ స్టాండ్ సర్కిల్ నుంచి నర్సింగ్ కాలేజ్ వరకు విద్యార్థులు ఏఎంఆర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుప్రియ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ద్వారా యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సూచనల మేరకే ఉపయోగించాలని, మందులను అవసరం లేకుండా వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి

ఎదగాలి ప్రిన్సిపాల్ డా. హెచ్. పరమేశ్వర్

ర్యాలీ అనంతరం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. హెచ్. పరమేశ్వర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి, క్రమ శిక్షణతో, అంకితభావంతో చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఫార్మసీ విద్యకు నేటి సమాజంలో ఉన్న ప్రాముఖ్యతను, ఈ రంగంలో భవిష్యత్తులో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్లు, వివిధ క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డా. హెచ్. పరమేశ్వర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. మీర్ కాజిమ్ అలీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి నవంబర్ 20 ప్రజాజ్యోతి

గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన అజయ్ లతిక లకు శుక్రవారం వివాహం జరుగగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నూతన వదువరులను ఆశీర్వాదించారు ఈసందర్భంగా నూతన వధూవరులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.

మెట్‌పల్లిలో 3,737 నూతన సామాజిక భద్రతా పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ.

జగిత్యాల, నవంబర్ 20, ప్రజాజ్యోతి.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సామాజిక భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం నూతనంగా మంజూరైన 3,737 సామాజిక భద్రతా పింఛన్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, వెలమ సంఘ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు మంజూరైన పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, సామాజిక భద్రతా పింఛన్లు నిరుపేదల జీవనానికి ఎంతో తోడ్పాటునందిస్తాయని అన్నారు. ప్రతి నెలా అందే పింఛన్ వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నూతన పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించి మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత ఉండి పింఛన్లు పొందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి దరఖాస్తుల పరిశీలన కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అర్హులు అవసరమైన పత్రాలతో సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.వెలమ సంఘ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పింఛన్ సొమ్ము పేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, ఎంపీడీవో, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టు స్వామివారి నిజరూప దర్శనం పూర్వజన్మ సుకృతం

-- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ప్రజా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని స్వామివారిని ప్రార్థించాం.

బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని ఆలయాల అభివృద్ధికి వందల కోట్ల నిధులు -- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

జగిత్యాల, నవంబర్ 20, ప్రజాజ్యోతి.

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం చేసుకోవడం తన పూర్వజన్మ సుకృతమని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసే శక్తిని ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.శుక్రవారం జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన స్వామివారి నిజరూప దర్శన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆహ్వానం మేరకు కొండగట్టుకు వచ్చి స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 60 సంవత్సరాలకు ఒకసారి స్వామివారి విగ్రహానికి ఉన్న చందనాన్ని తొలగించే అరుదైన సందర్భంలో దర్శనం చేసుకునే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన మంత్రి, ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు, రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరింత శక్తిని, బలాన్ని ప్రసాదించాలని ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులను తట్టుకునే శక్తిని ప్రసాదించాలని, తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామి వారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. అనంతరం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం బాసర నుంచి భద్రాచలం వరకు గోదా వరి తీరంలోని పలు ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడు తోందని తెలిపారు. కొండగట్టు శ్రీ ఆంజ నేయ స్వామి ఆలయాన్ని కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.స్వామివారి నిజరూప దర్శనం చేసుకునే భాగ్యం కలగడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగేందుకు ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆలయ అర్చకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి చిత్రపటాలకు పాలాభిషేకం

బుగ్గారం నవంబర్ 20 (ప్రజాజ్యోతి):

మండలంలోని శేకల్ల, గంగాపూర్, సందయ్యపల్లె గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం మొదటి విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో అమలు చేశారు. ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఈ పథకం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి కృతజ్ఞతగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగునూరి నర్సాగౌడ్ ముఖ్య అతిథిగా



పాల్గొన్నారు. గ్రామ సర్పంచులు పర్స రమేష్, గాదె మహేష్, ఉపసర్పంచ్ నార్ల బుచ్చయ్య, నంది తిరుపతి, సుధీర్ సింగ్, సురేందర్, గాలిపెల్లి వెంకన్న, రావు, జంగిల్ రమేష్, చందు, దుర్గ సింగ్, మహేశ్వర్ సింగ్, మురళీ గౌడ్, నంది వెంకట్రాములు, పర్స గంగయ్య, జక్క విజయ్, గ్రామ ప్రజలు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినోను ఎదుర్కొనే శక్తిని అంజన్న ప్రసాదించాలని కోరుకున్నా

?? స్వామివారి దర్శన సమయంలో స్పీకర్, మంత్రి, ఎమ్మెల్యేలు



కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం ముందు స్పీకర్,మంత్రి,ఎమ్మెల్యేలు



కొండగట్టు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతాం

రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్

కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న స్పీకర్, మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యేలు

మల్యాల, నవంబర్ 20,ప్రజా జ్యోతి :

ఎల్ నినోను ఎదుర్కొనే శక్తిని ప్రజా ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రసాదించాలని కొండగట్టులోని ఆంజనేయ స్వామిని వేడుకున్నట్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు.శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ నర్సింగరావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి కొండగట్టు ఆంజనేయ స్వామిని స్పీకర్ దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు స్పీకర్ తో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండగట్టు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతాం.....

రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్

ప్రపంచానికి సవాలుగా మారిన ఎల్ నినోను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజా ప్రభుత్వానికి అందించాలని కొండగట్టు ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు స్పీకర్ తెలిపారు. 60 ఏళ్లకు ఒకసారి జరిగే చందనోత్సవములో పాల్గొనడం అదృష్టమని స్పీకర్ అన్నారు. ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ను గాడిలో పెడుతున్న ముఖ్యమంత్రికి కొండంత ధైర్యాన్ని ఆంజనేయ స్వామి ప్రసాదించాలని కోరుకున్నట్లు స్పీకర్ తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వస్తున్న కరువు ను గుర్తించిన ప్రభుత్వం చేస్తున్న సూచనలను ప్రజలు తప్పకుండా పాటించాలని ఈ సందర్భంగా స్పీకర్ కోరారు. కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి తో మాట్లాడి ప్రత్యేక నిధులు సాధిస్తామని స్పీకర్ తెలిపారు.

నిజరూప దర్శనం అదృష్టం.....

మంత్రి లక్ష్మణ్ కుమార్

కొండగట్టులో స్వయంభుగా వెలసిన ఆంజనేయ స్వామి చందనోత్సవములో పాల్గొనడం స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవడం గత జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ఆలయాల విశిష్టతను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి బాసర నుండి భద్రాచలం వరకు కోట్ల రూపాయలు వెచ్చించి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ సహకారంతో కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని మంత్రి తెలిపారు.

నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.....

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఆరు శతాబ్దాల తరువాత జరుగుతున్న కొండగట్టు ఆంజనేయస్వామి చందనోత్సవము మహా సంప్రోక్షణ చొప్పదండి నియోజకవర్గానికి నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ మహత్వర కార్యం నా చేతులమీదుగా జరగడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొండగట్టులో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, ఆలయ అధికారులు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం కన్నుల పండుగ ఉందని, భక్తులు కొండగట్టు అంజన్న ను దర్శించుకొని ఆంజనేయ స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

నాచుపల్లి జేఎన్టీయూలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే నిధులతో రెండు లైట్ల ఏర్పాటు.. 8 సీసీ కెమెరాల మంజూరు

కొడిమ్యాల, నవంబరు 20 (ప్రజాజ్యోతి):

మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం తన నిధుల నుంచి మంజూరు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను శుక్రవారం ప్రారంభించారు. కళాశాలలో అదనంగా 8 సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ క్రాస్‌రోడ్స్ వద్ద విద్యార్థుల రవాణా సౌకర్యార్థం అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్‌కు ఫోన్ ద్వారా కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కొండగట్టు అంజన్నకు భద్రాచలం పట్టు వస్త్రాలు

మల్యాల,నవంబర్ 20,ప్రజా జ్యోతి:

కొండగట్టు ఆంజనేయ స్వామి చందనోత్సవం మహాసంపక్షణ కార్యక్రమంలో 41 రోజుల నిజరూప దర్శనం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని 12 ఆలయాల నుండి పట్టు వస్త్రాలు రానున్నాయి. ఈ సందర్భంగా మొదటి రోజు శుక్రవారం భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం తరుపున ఆంజనేయ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగిందని ఆలయ అధికారులు తెలిపారు. భద్రాచలం దేవస్థానం నుండి తీసుకువచ్చిన పట్టు వస్త్రాలకు కొండగట్టు దేవస్థాన అధికారులు, ప్రధాన అర్చకులు ఘనంగా స్వాగతం పలికి సాంప్రదాయ బద్ధంగా ఎదుర్కొని స్వామివారి సన్నిధికి తీసుకువచ్చి సమర్పించినట్లు ఆలయ ఈవో అంజన రెడ్డి తెలిపారు.

భద్రాచలం నుండి వచ్చిన పట్టు వస్త్రాలను శాస్త్రోక్తంగా స్వాగతం పలుకుతున్న కొండగట్టు ఆలయ అధికారులు.



రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి: సర్పంచ్ చేకుట అరుణ-శేఖర్

బీర్ పూర్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):

సారంగాపూర్ మండల కేంద్రంలో ఆసాల మధుకర్, కొదురుపాక స్వామిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎల్.ఎల్. ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్' దుకాణాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్ చేకుట అరుణ-శేఖర్, ఉప సర్పంచ్ లచ్చయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తూ వారి ఎదుగుదలకు తోడ్పడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామచంద్ర రెడ్డి, నాయకపు గూడెం సర్పంచ్ పుష్పనాథ్, బట్టపల్లి సర్పంచ్ మర్రిపెల్లి అశ్వినీ-రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న తాటిపర్తి శైలేందర్ రెడ్డి

అనంతరం వివాహ వేడుకలో నూతన వధూవరులకు ఆశీస్సులు

వెల్గటూర్, నవంబర్ 20 , ప్రజా జ్యోతి,

పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ముత్తునూరు గ్రామంలో గుమ్ముల రాజేష్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ వేడుకకు పిసిసి కార్యవర్గ సభ్యులు,వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తాటిపర్తి శైలేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించి, లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అదే గ్రామంలో సంఘ సత్తన్న కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోళ తిరుపతి, గ్రామ సర్పంచ్ లక్ష్మి, పోచమల్లు, మాజీ ఎంపీటీసీ మంజుల, రెడ్డన్న, రామన్న, ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా సదుపాయం

కార్మికుల భద్రతకు భరోసా కల్పించడమే లక్ష్యం

బుగ్గారం నవంబర్ 20(ప్రజాజ్యోతి) :

గ్రామపంచాయతీ కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బుగ్గారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులకు వ్యక్తిగత ప్రమాద బీమా సదుపాయం కల్పించారు. రాయల్ సుందరం సంస్థ ద్వారా ఈ బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ఇతర గ్రామపంచాయతీ సేవల్లో నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు సేవలందించే కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రమాదాల సమయంలో ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మికుల సంక్షేమానికి భరోసా కల్పించేలా గ్రామపంచాయతీ తీసుకున్న ఈ చర్య పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ-రాజయ్య, ఉపసర్పంచ్ జంగ లావణ్య-శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.ఏ. అక్బర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగునూరి నర్సాగౌడ్, వార్డు సభ్యులు బెజ్జారపు రాజు, ఆకుల శేఖర్, పోస్టల్ శాఖ ప్రతినిధి నాగరాజు, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



మేరా యువ భారత్ యూత్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

మల్యాల,నవంబర్ 20, ప్రజా జ్యోతి:

మేరా యువ భారత్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్ ఆధ్వర్యంలో మల్యాల లోని స్థానిక జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల క్రీడలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అతిధులు ఇన్చార్జి ప్రిన్సిపల్, అధికారులు పాల్గొని విద్యార్థులను యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.....యువత మొత్తం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నషాముక్తు భారతం నిర్మాణం అవ్వాలంటే యువతే ముఖ్యమని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటే క్రీడల్లో నిమగ్నమై వికసిత భారత్లో భాగస్వామ్యులు కావాలని బాధ్యత గుర్తు చేశారు. ఇందులో భాగంగా కబడ్డీ వాలీబాల్ 20 టీములు పాల్గొన్నాయి. ఈరోజు కబడ్డీ వాలీబాల్ క్రీడలను నిర్వహించడం జరిగింది. రేపు తక్కళ్ళపల్లి హైస్కూల్లో అథ్లెటిక్స్ నిర్వహించబోతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ యూత్ వాలంటీర్ మల్యాల రాకేష్, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల్లో జగిత్యాల మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):


59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో జగిత్యాల ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. “గ్రంథాలయంలో విలువలు మరియు బాధ్యతలు” అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో బి.ఏ. చివరి సంవత్సరం విద్యార్థిని ఎ. జ్యోతిశ్రీ ప్రథమ బహుమతి, బి.ఏ. మొదటి సంవత్సరం విద్యార్థిని సి.హెచ్. మధుశ్రీ ద్వితీయ బహుమతి సాధించి కళాశాలకు కీర్తి తెచ్చారు.విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు మల్లికార్జున్, బాధ్య ప్రిన్సిపాల్స్ డా. ప్రమోద్ కుమార్, డా. చంద్రయ్య, అధ్యాపక సంఘం కార్యదర్శి సంగీతారాణి, డా. జమున, రామకృష్ణ మరియు అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం

బుగ్గారం నవంబర్ 20 (ప్రజాజ్యోతి):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ శేకల్ల గ్రామ సర్పంచ్ పర్స రమేష్ మరోసారి తన మాటను నెరవేర్చుకున్నారు. గ్రామంలో ప్రతి ఆడబిడ్డ వివాహానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు, గురువారం మందపల్లి రమేష్-అంజలి దంపతుల చిన్న కుమార్తె లతశ్రీ-గణేష్ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఆచరణలో అమలు చేస్తూ, ఆడబిడ్డల వివాహాలకు తన వంతు సహకారం అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నార్ల బుచ్చయ్య, నంది తిరుపతి, సుధీర్ సింగ్, శ్రీకాంత్, నరేష్, సంగవేని సంజీవ్, అప్సర్, రాజాగౌడ్, జంగిల్ రమేష్, పర్స భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లి మండల్ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా అవునూరి శ్రీధర్

గొల్లపల్లి నవంబర్ 20 ప్రజాజ్యోతి

గొల్లపల్లి మండల కేంద్రంలో ఈరోజు నిర్వహించిన మండల ఉప సర్పంచుల సమావేశంలో నూతన మండల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు జంపన్న జానీ ఆదేశాల మేరకు, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గొల్లపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు నూతన కమిటీ వివరాలు మండల అధ్యక్షులు అవునూరి శ్రీధర్ ఉపాధ్యక్షులు గంగాధర్, అశోక్, తిరుపతి ప్రధాన కార్యదర్శి జక్కుల తిరుపతికోశాధికారి ఇసగంటి తిరుపతికార్యదర్శి సంగెం రజితఈ కార్యక్రమంలో శంకర్రావుపేట ఉపసర్పంచ్ రంజిత్ రెడ్డి, దత్నూర్ ఉపసర్పంచ్ జక్కుల తిరుపతి గోవిందుపల్లె ఉపసర్పంచ్ అశోక్ అబ్బాపూర్ ఉపసర్పంచ్ తిరుపతితో పాటు వివిధ గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు అనంతరం ఉపసర్పంచుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ, ఎంపీఓ అధికారులను కలిసి మండలంలోని ఉపసర్పంచులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు అలాగే ఈ డిసెంబర్ 27వ తేదీన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న ఉపసర్పంచుల మహాసభ పోస్టర్ను నాయకులు ఆవిష్కరించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులకు జిల్లా నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు

